స్కెచ్ :

# రాముని దరఖాస్తు

- బియస్సెన్నార్.

రాముడు కలెక్టరాఫీసులో ప్యూన్ పనికి దరఖాస్తు పంపేడు

పేరు : రాముడు
వూరు : గుంతలపల్లి
తండ్రి : పెదరాముడు
వూరు : గుంతలపల్లి
తాత్కాలిక చిరునామా : గుంతలపల్లి (పోష్టు), ఆం. ప్ర.
శాశ్వత చిరునామా : గుంతలపల్లి (పోష్టు), ఆం. ప్ర.
ప్రస్తుత వుద్యోగం : పెద్దరైతింట్లో కూలిపని
తండ్రి వుద్యోగం : తండ్రి, తాత, అంతకు ముందువారుకూడ అదే యింట్లో అదేపని.
వయసు : పందొమ్మిది
చదువు : సెకండ్‌ఫారం ఫెయిల్
స్కూల్ పేరు : గుం. ప. ఆ. ప్రై. స్కూల్.
ఆటలలో ప్రావీణ్యత : మెడపట్లు పట్టుట; గడార్లెత్తుట; చెడుగుడు.
మాతృభాష : తెలుగు
మతము : } అవన్నీ ఎందుకుసార్ !
దేశము : }
యింతకు ముందు చేసిన నేరములు : ఏమీ లేవు.
జైలుకు పోయిన సమాచారము : ఒకసారి పోలీసిన్స్పెక్టర్ మా వూరికి వచ్చినపుడు బూటుకాలికున్న కల్లు మరకలని (కల్లంగడిలో లంచమీనందుకు కుండలు బగలగొట్టొచ్చేడు) తుడవమన్నప్పుడు నే నెదురుతిరిగితే జేబులో వేసుకుపోయి జైల్లో వేసేడు.

ఆ వూరి మున్సబయిన పెద్దరైతు సర్టిఫికెట్ యిలా యిచ్చేడు :

రాముడు బలవంతుడు. రాముడు ఎట్టిపనినయినను సునాయాసముగ చేయ గలడు. రామునికి పెండ్లి అయినది. భార్య అందమైనది. మంచి పనికత్తె. రామునికి ఆస్తిలేదు కాని కష్టపడి బతకడానికి దేవుడు దయతో కండబలము మెండుగ ఇచ్చినాడు.

మున్సబుగారి సర్టిఫికెట్ చూసి కలెక్టర్‌గారు చాల సంతోషించేరు. కాని అంతలోనె కనుబొమ్మలు ముడివేసేరు. బీదవాడు ఎదురుతిరగడమన్న అడవిలో అగ్గిపుట్టినట్లు. ఈ ప్రపంచంలో అంతకన్న అపాయమైంది మరేదీలేదు.

...అలాంటి అపాయాన్నుంచి 'ప్రపంచాన్ని' రక్షించడానికేగద పోలీసులు, పార్లమెంటులు, ఎన్నికలు, కలెక్టర్లు, జైళ్ళు, వకీళ్ళు, సైన్యాలు, కోర్టులు, రాజ్యాంగాలు, వురికంబాలు, సెక్స్ సినిమాలు, సెంటిమెంట్ల పుస్తకాలు, వార పత్రికలు, వార్తాపత్రికలు, ఆటం బాంబులు, అహింసా సిద్ధాంతాలు (గాంధీ టోపీలు), మతాలు, తుపాకులు...యిన్ని వుండీకూడ ! యిన్ స్పయిట్ ఆఫ్ ఆల్ దీస్...! ప్రజలన బడే యీ రాస్కెల్స్ ఎంత తెగించిపోయేరు ! పైగా జైలుకు పోయేనంటున్నాడు గాని నేరం చేయలేదంటున్నాడు. జైలుకి వెళ్ళడమే నేరం. అంతే. యింకా పద్మూడు పద్నాల్గు అయిటమ్‌ల దగ్గర దరఖాస్తు అసంపూర్తిగ వుంది. దేశభక్తి లేదు. ద్రోహి.. .........

కలెక్టరింక ఆలోచించలేదు. రామునికి వుద్యోగం రాలేదు.

ఆ తరవాత రాముడొకసారి ఒకానొక విషయమై మున్సబును చితకదన్ని నందుకు మళ్ళీ జైలుకు పోయేడు. రాముడు దాన్ని జైత్రయాత్ర అంటాడు.

..............................

పాఠకులు దీన్ని యిదేమి కథ అని అనుకుంటారేమొ నాకు తెలీదుగాని ఆ నడుమ నేను రామునికి చూపించినప్పుడు అతను సంతృప్తిగ నవ్వేడు. ఆ దరఖాస్తు ఫారాన్ని రాముని సూచనలమేరకు పూర్తిచేసింది నేనే.

---

గత సంచికలో కాళోజీ కవిత 'తిరుగుబాటు గెలుస్తుంది' 3-12-75 న ఆయన డైరీలో వ్రాసుకున్నది. భూమయ్య, కిష్టాగౌడ్‌లు ఉరితీయబడిన తేది 1-12-75.

[సెప్టెంబర్ 11 మావో - సె - టుంగ్ ప్రథమ వర్ధంతి. అక్టోబర్ 1 జనచైనా అవతరణ సందర్భంగా జనచైనా విప్లవ పోరాటంలో సాంస్కృతిక సైన్యం పాత్ర గురించి మావో రచన వుంటుంది.]

466